క్లుప్తంగా

శ్రీలక్ష్మీదేవికి సామూహిక కుంకుమ పూజ



నాగాయలంక: గ్రామంలోని ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న 67వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం 150మందికి పైగా మహిళలతో 108 శ్రీలక్ష్మీదేవి కలశాలకు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. పురోహిత శిరోమణి కూరపాటి రాధాకృష్ణమూర్తి పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో శ్రీలక్ష్మీ అమ్మవారి ప్రధాన పీఠం వద్ద ఆర్యవైశ్యసంఘం నాయకుడు మానేపల్లి శ్రీనివాసరావు, పద్మజ దంపతులతో ప్రధాన పూజా క్రతువు చేయించారు. నాగాయలంక, పరిసర గ్రామాల నుంచి తరలి వచ్చిన మహిళా భక్తులు ఉత్సవ పందిరిలో బారులు తీరి కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వస్త్ర వ్యాపారులు గోలి సత్యనారాయణ, హరిప్రసాద్ ఆర్థిక సౌజన్యంతో బంగారు పూత కలిగిన వెండి లక్ష్మీమాత రూపులను ప్రసన్నగణపతి దేవస్థానం ఉత్సవ కమిటీ ప్రతినిధులు, దాతలు చేతులమీదుగా పూజలో కూర్చున్న మహిళలందరికీ అందజేశారు. అనంతరం 600 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం తలశిల జనార్దనరావు ఆర్థిక సహకారంతో ప్రసిద్ధ భాగవతారిణి పి.విజయలక్ష్మి(రాజమండ్రి) రుక్మిణీ కల్యాణం హరికథాగానం చేశారు.

వరద బాధిత విద్యార్థులకు చిన్నారుల చేయూత



కె.కొత్తపాలెం(మోపిదేవి): వరదల్లో విద్యాసామగ్రి పూర్తిగా కోల్పోయిన విద్యార్థులకు పురిటిగడ్డ ప్రభుత్వ పాఠశాల చిన్నారులు చేయూత అందించారు. మండలంలోని కె.కొత్తపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులు ఇటీవల వరదల కారణంగా విద్యాసామగ్రి కోల్పోయిన వారికి స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పాకెట్ మనీగా దాచుకున్న సొమ్మును చిన్నారులు తోటి విద్యార్థులకు పుస్తకాలుగా అందించడం వారి సేవాభావాన్ని తెలియజేస్తోందన్నారు. గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, రావి రత్నగిరి, దేవరపల్లి సురేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రసన్న గణపతి లడ్డూ వేలం ధర రూ.43,116

నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహం చేతిలో ఉంచిన 32 కేజీల లడ్డూ ప్రసాదానికి శుక్రవారం రాత్రి వేలంపాట నిర్వహించారు. గ్రామస్తులు, భక్తుల సమక్షంలో దేవస్థానం కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు వేలం పాట నిర్వహించగా గ్రామంలోని ఎలక్ట్రికల్స్ వ్యాపారి పొన్నూరు వెంకట్రావు (రమణ), శ్రావణి దంపతులు, పొన్నూరు హరిబాబు రూ.43,116కు దక్కించుకున్నారు.

చిట్టిపాలెం గణేషుని లడ్డూ రూ.15,600

చిలకలపూడి(మచిలీపట్నం): చిట్టిపాలెం గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో గ్రామానికి చెందిన చండిక సురేష్ రూ.15,600కు పాడి లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సన్న, చిన్నకారు రైతులకు నష్టపరిహారం అందించాలి

ఘంటసాల: అధిక వర్షాల కారణంగా పంట నష్టపోయిన సన్న, చిన్నకారు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఘంటసాల మండల జనసేన నేత అందె జగదీష్ విజ్ఞప్తిచేశారు. మండల పరిధిలోని అచ్చెంపాలెం నుంచి దాలిపర్రు గ్రామాలను కలుపుకొంటూ వెళ్లే గుండేరు డ్రైన్, చిల్లలవాగు మైనర్ డ్రైన్‌లకు ఇరువైపులా ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన నిరుపేద చిన్న, సన్నకారు రైతులు తలా కుంటా, సెంటు పోరంబోకు భూముల్లో సుమారు 500 ఎకరాల్లో గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని చెప్పారు. అధిక వర్షాలకు డ్రైన్లు పొంగి పంట పొలాలన్నీ ముంపునకు గురయ్యాయన్నారు. పట్టా భూమి ఉన్న రైతుల పేర్లను మాత్రమే అధికారులు నమోదు చేసి నష్ట పరిహారం ఇస్తామనడం బాధాకరమన్నారు. లంక భూముల రైతులకు ఇచ్చే విధంగా వీరికి కూడా పరిహారం అందించాలన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

పెడన: స్థానిక వీరభద్రపురంలో శుక్రవారం రాత్రి సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి స్థానిక సీపీఎం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంతాప సభను నిర్వహించారు. స్థానిక నాయకులు గోరు రాజు, వాసా గంగాధరం, పంచల నరసింహం పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- శిథిలావస్థలో పెదతుమ్మిడి మీడియం డ్రైన్‌పై వంతెన
- పట్టించుకోని అధికారులు
- భయాందోళన చెందుతున్న వాహనదారులు



రెయిలింగ్ లేకుండా పెద్ద, పెద్ద గుంతలతో ప్రమాదకరంగా ఉన్న పెదతుమ్మిడి మీడియం డ్రైన్‌పై వంతెన



జూన్ నెలలో డ్రైన్‌లో పడిపోయిన చేపల లోడు లారీ(ఫైల్)

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి మీడియం డ్రైన్‌పై బంటుమిల్లి–గుడివాడ ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న వంతెన శిథిలమై ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఏళ్ల తరబడి పరిస్థితి ఇలాగే ఉన్నా ప్రతిసారీ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చేయడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైన్‌పై వంతెన నిర్మాణం చేసి దాదాపు వంద సంవత్సరాలు అవుతోందని తెలుస్తోంది. సుమారు 40 సంవత్సరాల క్రితం వంతెన శిథిలం కాగా వంతెన కింద ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేశారు. పాత రోజుల్లో నిర్మించిన వంతెన కావడంతో వంతెన ఇరుకుగా ఉంటుంది. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో వేలాది ఎకరాల చేపల చెరువులు తవ్వడంతో పాటు, ఓఎన్జీసీ పెద్ద ఎత్తున ఆయిల్ నిక్షేపాలను వెలికి తీసింది. దీంతో ఈ రహదారిపై భారీ వాహనాలు అత్యధికంగా రాకపోకలు చేస్తున్నాయి. ఇవే కాకుండా కైకలూరు, ఆకివీడు, మండవల్లి గ్రామాల్లో ఇతర రాష్ట్రాలకు చేపల లోడుతో వెళ్లే 30 నుంచి 40 టన్నుల బరువున్న లారీలు 216 జాతీయ రహదారి దగ్గరగా ఉండటంతో ఈ వంతెన పైనుంచి ప్రయాణించి బంటుమిల్లి వద్ద జాతీయ రహదారి పైకి వెళుతున్నారు. ఇలా చేపల లోడుతో ప్రయాణించే లారీ ఒకటి ఈ ఏడాది జూన్ 11వ తేదీ రాత్రి అదుపు తప్పి డ్రైన్‌లో పడిపోయింది. ఆ సమయంలో నీరు లేకపోవడంతో లారీ సిబ్బంది ప్రాణాలతో బయటపడ్డారు. తాజాగా వంతెనపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రెయిలింగ్ రెండు పక్కలా ఊడిపోయింది. గత సంవత్సరం వంతెనపై రంధ్రాలు ఏర్పడితే రైతు సంఘ నాయకులు ధర్నా చేశారు. అప్పుడు అధికారులు వాహనాల రాకపోకలు నిలిపివేసి తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి అంచనాలు ప్రభుత్వానికి పంపామన్నారు తప్ప ఎటువంటి హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. తర్వాత వంతెనపై గుంతలు ఏర్పడితే బీజేపీ నాయకుడు మురాల వెంకటేశ్వరరావు సొంత ఖర్చుతో రాళ్లు తెచ్చి గుంతలు పూడ్చారు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలకు వంతెనపై పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ వర్షాలకు డ్రైన్ వరద నీటితో పొంగి పొర్లుతోంది. భారీ వాహనాల కన్నా ద్విచక్ర వాహనాలు, ఆటోలకు ప్రమాదం పొంచి ఉంది. రాత్రి సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు అదుపు తప్పి డ్రైన్‌లో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. డ్రైన్ ఇరువైపులా మార్జిన్లు కూడా కోతకు గురై ఉన్నాయి. వాహన ప్రమాదాలు, ప్రాణ నష్టాలు జరగక ముందే అధికారులు మేల్కొని వంతెన వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ఇరువైపులా స్పీడు బ్రేకర్లు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. వంతెన పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు కలగకముందే పాలకులు, అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కృత్తివెన్ను: మండల పరిధిలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం, చెరుకుమిల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ ఎం. భాస్కరరావు తెలిపారు. స్టేషన్ నిర్వహణ పనుల వల్ల విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు.

గూడూరులో...

గూడూరు: మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల నిర్వహణ చేపడుతున్న కారణంగా శనివారం గూడూరు మండలంలో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.రాజేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

నేడు పెడనలో ఉచిత పశువైద్య శిబిరం

పెడన: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెడన బంటుమిల్లి రోడ్డులోని పశువుల ఆసుపత్రి వద్ద శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ల బాబురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో పశువులకు చికిత్సతో పాటు గొంతువాపు వ్యాధి రాకుండా పశువులకు, పడ్డలకు, పెయ్యదూడలకు టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఏడీ బాబూరావు కోరారు.

90 మత్స్యకార కుటుంబాలకు ఐవీఎం ట్రస్ట్ సాయం

- శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో బాధితులకు అందించిన ఎమ్మెల్యే
- జింకపాలెం ప్రధాన రోడ్డు శాశ్వత పునర్నిర్మాణానికి కృషి



బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఐవీఎం డైరెక్టర్ రోజా

నాగాయలంక: ఎదురుమొండి దీవిలో ఇటీవల పూర్తిగా కృష్ణానది వరద కోతకు గురైన గొల్లమంద, జింకపాలెం గ్రామాల ప్రధాన రోడ్డు కట్ట శాశ్వత పునర్నిర్మాణానికి కలెక్టర్‌తో చర్చించి ప్రణాళిక రూపొందిస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక కృష్ణానదీ తీరంలోని చినకరకట్ట కింద నివాసిత ప్రాంతంలో వరద ప్రభావిత మత్స్యకార కుటుంబాలకు ఐవీఎం ట్రస్టు ద్వారా శుక్రవారం రూ.లక్షా ఎనిమిది వేలు విలువైన నిత్యావసర సరుకుల కిట్స్, దుప్పట్లను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, సంస్థ డైరెక్టర్ వేములపల్లి రోజా చేతుల మీదుగా అందజేశారు. పురిటిగడ్డ గ్రామానికి చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నదీతీరంలోని స్థానిక శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, ఉపసర్పంచి తలశిల నాని, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, శ్రీరామపాద క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, మత్స్యసంఘాల ప్రతినిధులు లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఖొజ్జిల్లిపేట కు చెందిన ముగ్గురు అనాథ చిన్నారులను సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేసి ఆదుకున్నారు. ఆ ప్రాంతానికి చెందిన దిల్బర్ బాషా, షేక్ ఫజీమున్నీసా దంపతులు మృతి చెందారు. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు ముగ్గురు పిల్లల పేరిట రూ.5 వేలు చొప్పున పోస్టల్ సేవింగ్స్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ బాషా, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.వెంకటేశ్వరమ్మ, సభ్యులు రౌతుల ప్రసాద్, సుమంత్, మహిళా విభాగం కోశాధికారి మాజేటి లక్ష్మీకాంతం, బడుగు ఉమాదేవి, అంకాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వరిగడ్డి అందించిన ఘంటసాల రైతులు

ఘంటసాల: కృష్ణానదికి ఇటీవల వచ్చిన వరదల కారణంగా లంక గ్రామాల్లోని పశువులకు మేత లేక ఆయా గ్రామాల రైతులు, పశువుల కాపరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఘంటసాల గ్రామానికి చెందిన నిమ్మగడ్డ శేషగిరిరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో వరిగడ్డి కొని ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాలకు చెందిన పాత ఎడ్లంక, కె.కొత్తపాలెం, ఆముదాల లంక, రాయలంక గ్రామాల్లోని పశువులకు అవసరమైన వరిగడ్డిని శుక్రవారం ఆయా గ్రామాల రైతులకు పంపించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ నుంచి పోర్టుకు వెళుతున్న భారీ టిప్పర్ రోజువారీ కూలి పనులు చేసుకునే మేస్త్రి కాగిత శివ ప్రసాద్ అలియాస్ నాని ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి, అతని చేతిపై నుంచి వెళ్లడంతో చెయ్యి నుజ్జునుజ్జుగా నలిగింది. ప్రమాదానికి గురైన అతన్ని చికిత్స కోసం బందరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారిస్తున్నారు.

ఎడ్లంక వరద బాధితులకు ఆపన్న హస్తం



ఎడ్లంక బాధితులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న బుద్ధప్రసాద్, దాత భాస్కరరావు

ఎడ్లంక(అవనిగడ్డ): వరద ముంపు కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఎడ్లంక వాసులకు పలువురు ఆపన్నహస్తం అందించారు. హైదరాబాద్‌కు చెందిన పోతురాజు ఫౌండేషన్ ద్వారా రూ.75వేల విలువైన నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎడ్లంక పల్లెపాలెంలోని 160 వరద బాధిత కుటుంబాలకు వీటిని అందించారు. కార్యక్రమంలో పోతురాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పోతురాజు భాస్కరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, ఉపాధ్యక్షుడు తుంగల నరేష్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల సత్యనారాయణ, కమ్మిలి సాయి భార్గవ, బడుగు రవికుమార్, సింహాద్రి బుజ్జి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వితరణ

ఎడ్లంక వరద బాధితులకు పలు ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు రూ.1.10 లక్షల విలువగల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అవనిగడ్డ, మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు చెందిన ఉపాధ్యాయులు సేకరించిన రూ.1.10 లక్షల వ్యయంతో సమకూర్చిన ఆరు రకాల నిత్యావసర వస్తువులను శుక్రవారం అందజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ.వి. రామారావు, కృష్ణా జిల్లా కార్యదర్శి ఆలూరి సురేష్, బేతేల్ చర్చి పాస్టర్ పాల్‌మేర్ చేతుల మీదుగా వీటిని అందించారు. ఏపీటీఎఫ్ నాయకులు వినీల పాల్గొన్నారు.

పశుగ్రాసం అందజేత

ఎడ్లంక గ్రామానికి చెందిన పశు పోషకులకు మోపిదేవి మండలానికి చెందిన పలువురు రైతులు పశుగ్రాసాన్ని అందించారు. మోపిదేవి మండలం వెంకటాపురం, శివరామపురానికి చెందిన పలువురు రైతులు ట్రాక్టర్ ద్వారా వచ్చి పశుగ్రాసాన్ని తీసుకొచ్చి 100కు పైగా పశువులకు సరిపడా గ్రాసాన్ని రైతులకు అందించారు. వరద వల్ల ముంపునకు గురై మేత లేక అల్లాడుతున్న ఎడ్లంక పశువులకు గ్రాసాన్ని అందించిన రైతులకు పశుపోషకులు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు రావి వీరయ్య, మేకా రాధాకృష్ణ, వి.శివప్రసాద్, కంఠమనేని మను, దోవా గోవర్ధన్ పాల్గొన్నారు.

నిర్మాణ దశలోనే నెర్రెలిచ్చిన రహదారి

జయపురం–వి.కొత్తపాలెం వద్ద కాలువ వైపు కుంగిన మార్జిన్



జయపురం- వి.కొత్తపాలెం మధ్య నెర్రెలిచ్చిన రహదారి మార్జిన్

కోడూరు: అవనిగడ్డ–కోడూరు ప్రధాన రహదారి నిర్మాణ దశలోనే నెర్రెలిచ్చింది. కోడూరు నుంచి అవనిగడ్డ వరకు 13 కిలోమీటర్ల మేర సుమారు రూ.16.50 కోట్ల వ్యయంతో నూతన రహదారి నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ నిర్మాణ పనులు ఐదు నెలల నుంచి నత్తనడకన జరుగుతున్నాయి. రహదారిపై కేవలం వెట్ మిక్స్ మాత్రమే రెండు లేయర్లుగా వేసి తరువాత పనులను నిలిపి వేశారు. ఈ రహదారికి ఒక వైపు ప్రధాన పంటకాలువ మరొకవైపు డ్రైనేజీ ఉంటుంది. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు వరద నేపథ్యంలో కాలువకు పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయడంతో రహదారి మార్జిన్ కుంగిపోయింది. జయపురం- వి.కొత్తపాలెం గ్రామాల్లో రహదారికి కాలువకు మధ్య ఉన్న మార్జిన్ పూర్తిగా కుంగిపోయి బీటలిచ్చింది. ఈ ప్రాంతంలో రహదారి ప్రమాదకరంగా మారిందని, రాత్రి వేళల్లో బీటలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. రహదారి నిర్మాణ దశలో ఉంది కాబట్టి సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కర్షకులకు మిగిలింది కన్నీరే!

ముంపుతో కుళ్లిన పంట



కలపటం గ్రామంలో కుళ్లిపోయిన పంట పొలాన్ని చూపిస్తున్న రైతు

గూడూరు: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ముంపు బారిన పడిన పంట కుళ్లిపోవడంతో రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు. వర్షాలు వీడి వారం రోజులు అయినా పొలాల్లో నీరు బయటకు వెళ్లకపోవడంతో పంటంతా నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మురుగు కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, నాచు పెరిగిపోవడంతో పొలాల్లో ముంపు బయటకు పోవడం లేదు. మండలంలోని ఆకులమన్నాడు, గూడూరు, తుమ్మలపాలెం, కలపటం, పినగూడూరులంక, కంకటావ, ముక్కొల్లు, గండ్రం, తరకటూరు, మల్లవోలు, రామరాజుపాలెం, రామన్నపేట, మద్దిపట్ల ప్రాంతాల్లో పంట నష్టం ఎక్కువగా కనిపిస్తుంది. మళ్లీ పంట వేయడానికి అవకాశం లేదు. పర్యవసానంగా ఖరీఫ్ అంతా వర్షార్పణం అయిందని, దిగుబడులు సంగతి దేవుడెరుగు అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి ఎలా వడ్డీలతో చెల్లించాలా అని రైతులు మథన పడుతున్నారు. ప్రభుత్వం ఉదారంగా తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక పోతేపల్లిలోని గ్రేస్ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం చట్ట విరుద్ధమన్నారు. ఎవరైనా స్కానింగ్ సెంటర్‌లో ఇటువంటి పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం అందిస్తే సంబంధిత అధికారుల ద్వారా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, లీగల్ కౌన్సిల్ రహ్మతున్నీసాబేగం, కళాశాల ప్రిన్సిపాల్ సరస్వతి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంతో రక్తహీనత

చిలకలపూడి(మచిలీపట్నం): పౌష్టికాహార లోపం కారణంగా రక్తహీనత ఏర్పడుతుందని సీడీపీవో గ్లోరీ తెలిపారు. మండల పరిధిలోని తాళ్లపాలెం పంచాయతీలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్లోరీ మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్నాదేవి, ఏఎన్ఎం సుధారాణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పోషకాహార ప్రాముఖ్యంపై సదస్సు

గూడూరు: పోషకాహార మాసోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన గూడూరు నగరంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఏఎన్ఎం హేమలత వివరించారు.

పూజలందుకుంటున్న కరెన్సీ గణనాథుడు



బందరు రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కరెన్సీ గణనాథుడు



బంటుమిల్లి మండలం చోరంపూడి గ్రామంలో నిమజ్జనానికి బయలు దేరిన గణనాథుడు



పెడన జగపతి థియేటర్ వీధిలో ప్రత్యేక పూజలను అందుకుంటున్న లంబోదరుడు

మచిలీపట్నంటౌన్: వినాయకచవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు పందిళ్లలో గణనాథులు కరెన్సీ అలంకారంతో దర్శనమిచ్చారు. రూ.50, 100, 200, 500 నోట్లతో అలంకరించటంతో పాటు దండలు తయారు చేసి వినాయకునికి వేశారు. కరెన్సీ అలంకారాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక సంతోష్ హోటల్ సెంటరులో, రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లలో వినాయకుని కరెన్సీతో అలంకరించారు. సంతోష్ హోటల్ పందిరిలో కామధేనువు విగ్రహంతో పాటు పందిరి ముందుభాగంలో బుల్లి వినాయకుని పట్టుకున్న శివుడు, గంట మోగిస్తూ శంఖంలో నుంచి పాలుపోస్తున్న వినాయకుడు సెట్టింగ్‌తో ఏర్పాటు చేసిన ప్రతిమలు ఆకట్టుకున్నాయి. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో రూ.2 లక్షలతో అలంకరించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద మీడియా మిత్రులు ఏర్పాటు చేసిన వినాయకచవితి పందిరిలో గణనాథుని డీఆర్వో కె.చంద్రశేఖర్ దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఏడో రోజుకు చేరిన వినాయకుని పూజలు

పెడన: పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఏడో రోజుకు చేరాయి. ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు.

కొనసాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు

కోడూరు: గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ప్రత్యేక పందిళ్లలో భక్తులు లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని హంసలదీవి, కృష్ణాపురం, ఉల్లిపాలెం, స్వతంత్రపురం గ్రామాల్లోని వినాయక విగ్రహాల వద్ద భక్తులు విశేష పూజలు చేశారు. శ్రీసిద్ధిబుద్ధి సమేత వినాయకుడి కల్యాణోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. అనంతరం పందిళ్ల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో గణనాథుల విగ్రహాలను ఊరేగించారు. ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానది వద్ద నిమజ్జనోత్సవాలను భక్తశ్రద్ధలతో నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా సమారాధనలు, నిమజ్జనాలు

బంటుమిల్లి: మండల పరిధిలో గణేష్ నవరాత్రులు శుక్రవారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా పెదతుమ్మిడి, జానకీరామపురం తదితర గ్రామాల్లో వినాయక చవితి పందిళ్ల వద్ద పెద్దఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. చోరంపూడి, బంటుమిల్లి తదితర గ్రామాల్లో వినాయక ప్రతిమలను ట్రాక్టర్లపై ఉంచి మేళతాళాలతో గ్రామోత్సవాలు నిర్వహించి బంటుమిల్లి ప్రధాన కాలువ, మల్లంపూడి ఉప్పుటేరులో నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా సాగిన గణేశుని నిమజ్జనం

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెంలో గణేశుని నిమజ్జన కార్యక్రమం యువకుల ఉత్సాహం, కేరింతల మధ్య కోలాహలంగా సాగింది. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దారిపొడవునా భక్తులు టెంకాయలు కొట్టి గణేశుని ఆశీర్వచనాలు అందుకున్నారు. జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, గుడివాక శివరావు, పలువురు జనసైనికులు పాల్గొన్నారు. మోపిదేవి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాన్ని ఊరేగింపుగా సమీపంలోని కృష్ణానదికి తరలించి నిమజ్జనం చేశారు. దారి పొడవునా డప్పు కళాకారులు, బాణసంచా సందడితో ఉత్సాహంగా ఊరేగింపు సాగింది.

దోమల నివారణ మందు పిచికారీ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టినట్టు పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, ఎంపీటీసీ అరజా ఆషాదేవి పాల్గొన్నారు.